వేతన వెతలు

- ఆర్థికభారంతో పంచాయతీలు
- గత ఐదునెలలుగా జీతాల్లేవ్
- ఇబ్బందుల్లో కార్మికులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని ఆయా గ్రామాల పంచాయతీల కార్మికుల జీవితాలు కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఆర్థికభారంతో పంచాయతీలు కూరుకుపోతున్నాయి. చేసిన పనులకు బిల్లులు మంజూరు కాక సర్పంచులు, సంబంధిత కాంట్రాక్టర్లు అప్పుల పాలవుతున్నారు. మరోవైపు కార్మికులు, సిబ్బందికి వేతనాలు ఇవ్వలేని దుస్థితి ఎదురవుతోంది. పంచాయతీ అకౌంట్లలో నిధులు ఉన్నట్లు చూపిస్తున్నా ట్రెజరీలో ఫ్రీజింగ్ కారణంగా బిల్లులు పాస్‌కాక పంచాయతీల నిర్వహణ ఇబ్బందిగా మారుతోంది. గత ఐదునెలలుగా జీతాలు అందక కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. కుటుంబం, పిల్లల చదువులు ఇతర ఖర్చులకు ఈ వేతనాలు వారికి ఎటు సరిపోవడం లేదు. సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో అవస్థలు ఎదుర్కొంటున్నారు.

1,520 మందికి పైగా కార్మికులు

జిల్లాలో 18 మండలాల పరిధిలోని మొత్తం 396 గ్రామ పంచాయతీలున్నాయి. వీటి పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు, వాటర్‌మెన్, ఎలక్ట్రీషియన్, ట్రాక్టర్ డ్రైవర్, కారోబార్లతో కలిపి 1,520 మందికి పైగా మల్టీపర్పస్ సిబ్బంది పనిచేస్తున్నారు. నెలకు రూ.8500 చొప్పున వీరికి వేతనాలు చెల్లిస్తున్నారు. జిల్లాలో ప్రతినెల రూ.కోటిలకు పైగా వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీలకు జనాభా ప్రతిపాదికన ప్రభుత్వాలు ఆర్థికసంఘం నిధులు విడుదల చేస్తున్నాయి. ఒక్కొక్కరికి రూ.166 చెల్లించాల్సి ఉన్నా ప్రస్తుతం రూ.115 కేంద్రం ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా సమానంగా నిధులు విడుదల చేస్తోంది. ఎస్ఎఫ్‌సీ నిధులు అదనంగా రావాల్సి ఉంది. వీటితో పాటు పంచాయతీల్లో ఇంటి పన్ను, రిజిస్ట్రేషన్లు, భూమి కిస్తు, వాహనాల పన్ను తదితర వాటిలోకి కూడా వస్తోంది. ప్రస్తుతం నిధులు రాక సిబ్బందికి వేతనాలు ఇవ్వని పరిస్థితి ఏర్పడింది.



మురుగుకాల్వలో చెత్త తీస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

డిమాండ్లు నెరవేర్చాలి..

ప్రభుత్వం తమ డిమాండ్లు నెరవేర్చాలని ఈనెల 14న నిర్మల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన చేపట్టారు. పట్టణ సీఐ కోరిక మేరకు ఐదుగురితో కూడిన సభ్యులను కలెక్టర్ కలవడానికి అనుమతించడంతో వారి ఆందోళనను విరమించారు. అనంతరం కలెక్టరేట్లో డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. జీవో నంబర్ 60 ప్రకారం పారిశుద్ధ్య కార్మికులకు రూ.16,500, కారోబార్, బిల్ కలెక్టర్లకు రూ.19,500, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.22,750 వేతనాలు చెల్లించాలి. యాక్ట్ 2/94ను రద్దు చేసి, సిబ్బందిని పర్మినెంట్ చేయాలి. కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలి. వారిని అసిస్టెంట్ కార్యదర్శులుగా నియమించాలి. మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలి. కార్మికుడు/కార్మికురాలు చనిపోతే వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు అమలు చేయాలి. అందరికీ డబుల్ బెడ్రూం, ఇంటి స్థలం ఉన్నవారికి నిర్మాణానికి రూ.5,50,000 ఇవ్వాలి. దళిత బంధు పథకాన్ని సిబ్బందికి ప్రాధాన్యత ఇచ్చి అమలు చేయాలని వినతిలో పేర్కొన్నారు.

ఇబ్బంది పడుతున్నాం



మూడు నెలలుగా జీతం రాక తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. నెలంతా కష్టపడితే వచ్చే జీతంతో ఇల్లు గడిచే పరిస్థితి ఉంటుంది. ప్రస్తుతం జీతాలు రాక పూట గడవడం కష్టంగా మారింది.
– ముత్తన్న, కార్మికుడు, బాధన్‌కుర్తి

సరిపడా వేతనం ఇవ్వాలి



చాలీచాలని వేతనాలతో అవస్థలు పడుతున్నాం. నిత్యావసర ధరలు పెరగడంతో వేతనాలు ఎటు సరిపోవడం లేదు. కుటుంబాన్ని పోషించడం కష్టమవుతోంది. సరిపడా వేతనాలు ఇవ్వాలి.
– నర్సయ్య, కార్మికుడు కొండుకూర్

అధికారులు స్పందించాలి



జీతం లేక కుటుంబ పోషణ భారంగా మారింది. అధికారులు స్పందించి జీతం అందించాలి.
– రమేశ్, కార్మికుడు, ఇక్బాల్ పంచాయతీ

క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన డీపీవో



ఎమ్మెల్యే విఠల్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న డీపీవో అంబాజీ నాయక్

తానూరు: డీపీవోగా నూతన బాధ్యతలు చేపట్టిన అంబాజీ నాయక్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని దేగాంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బంది రిజిస్ట్రేషన్ల కోసం అవసరమయ్యే ధ్రువీకరణ పత్రాలను సకాలంలో అందించేలా చూడాలని సూచించారు.

అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న మాజీ జెడ్పీచైర్మన్ శ్యాంసుందర్

లోకేశ్వరం: మండలంలోని బామ్నికే గ్రామంలో మాజీ జెడ్పీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ గురువారం అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఇటీవల అంబేద్కర్ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు అవమానించారని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. అంబేద్కర్ మండల సంఘం నాయకులు శంకర్, బాయమొల్ల భోజన్న, దండె రమేశ్, దిగంబర్, ప్రశాంత్, గంగన్న, భోజన్న, సాయన్న, రాములు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ గజ్జారాం యాదవ్

కుంటాల: గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో రెండో విడత స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా గురువారం అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పారిశుద్ధ్యం, పల్లె ప్రగతి, హరితహారం, ఉపాధి హామీ, విద్య, వైద్యం, ఆరోగ్యం, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో రహీం, స్వచ్ఛ భారత్ మిషన్ అధికారులు అబుజర్, గంగాధర్, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

మైనార్టీ రుణాల కోసం లబ్ధిదారుల ఎంపిక



లబ్ధిదారులను ఎంపిక చేస్తున్న ఎంపీడీవో

ముథోల్: మండల పరిషత్ సమావేశమందిరంలో ఎంపీపీ అయేషా అఫ్రోజ్ ఖాన్ ఆధ్వర్యంలో మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం గురువారం లబ్ధిదారులను ఎంపిక చేశారు. 9 యూనిట్లకు 308 మంది దరఖాస్తులు చేసుకున్నారు. 4 యూనిట్లకు ల్యాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేశారు. మిగతా 4 యూనిట్లకు బ్యాంక్ అధికారులు అర్హులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. దివ్యాంగులకు ఒక యూనిట్ ఎంపిక చేశారు. ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేశ్ బాబు, దరఖాస్తుదారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులు అందజేస్తున్న నాయకులు

కుంటాల: వివిధ కారణాలతో అనారోగ్యంతో బారినపడ్డ పలువురికి సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థికసాయం మంజూరైంది. కుంటాలకు చెందిన రంజిత్, రుచిత్, పొట్ట చిన్నన్నలకు రూ.18 వేలు, మల్లయ్యకు రూ.16 వేలు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తాద్రి గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, జుట్టు మహేందర్, వెంకటేశ్, తాటి మహేశ్వర్, పోశెట్టి, ముత్యంరావు, రఘు, రాకేశ్, సబ్బిడి గజేందర్, లక్ష్మణ్, మహిపాల్, అనిల్, ఖదీర్, జక్కుల ముత్యం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల తనిఖీ

ఖానాపూర్: పట్టణంలోని ఏఆర్ఎస్ జూనియర్ కళాశాలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని ఇంటర్ పరీక్ష కేంద్రాలను గురువారం ఫ్లయింగ్ స్క్వాడ్ బృందంతోపాటు పోలీసు అధికారులు తనిఖీ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ రామారావు, సీఐ నారాయణనాయక్, ఎస్సై రజనీకాంత్, డీవోలు ప్రశాంత్, సంజీవ్, సీఎస్‌లు రజిత, హమీద్, ప్రిన్సిపాల్ రమేశ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

దిలావర్‌పూర్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ కరీం పరిశీలించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులు హిందీ, తెలుగు భాషకు సంబంధించి పరీక్షలకు హాజరయ్యారు. 305 మంది హాజరవ్వగా 8 మంది విద్యార్థులు గైర్హాజయ్యారని పరీక్షా కేంద్ర నిర్వహణాధికారి కందూరి శంకర్ వెల్లడించారు.

సారంగాపూర్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మొత్తం 300 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా అందులో 295 మంది హాజరయ్యారని మిగతా ఐదుగురు గైర్హాజరయ్యారని పరీక్షల సీఎస్ మారుతి, డీవో బాపు తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తనిఖీ చేశారు.



పరీక్ష కేంద్రం వద్ద సీఐ, ఎస్సై

కడెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ పరీక్షకు 162 మంది విద్యార్థులకు గాను 158 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ కె. వెంకటేశ్వర్లు తెలిపారు.

నంబర్ ప్లేట్ లేకుంటే చర్యలు

నిర్మల్‌టౌన్: నంబర్ ప్లేట్ లేని వాటితోపాటు, రాంగ్‌రూట్లో వెళ్లే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్ అన్నారు. సీఐ మల్లేశ్ ఆదేశాలతో ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సైలు మాట్లాడుతూ పట్టణంలో కొందరు ట్రాఫిక్ చలాన్లు తప్పించుకునేందుకు నెంబర్ ప్లేట్ పెట్టుకోవడం లేదన్నారు. నంబర్ ప్లేట్‌ను విరగొట్టిన తప్పుగా రాసిన ఫోర్జరీ చీటింగ్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్ల చేతికి వాహనాలు ఇస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఇందులో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో పూజలు

నిర్మల్‌టౌన్: పట్టణశివారులోని గండిరామన్న క్షేత్రంలో కొలువుదీరిన సాయిబాబా ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. నిర్మల్‌తోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. గురువారం అన్నదాతలుగా వ్యవహరించిన పలువురు దంపతులను ఆలయ చైర్మన్ లక్కడి జగన్మోహన్‌రెడ్డి సన్మానించారు.

కుంటాల: మండలంలోని కల్లూరులో రెండో షిర్డీగా వెలుగొందుతున్న సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. బాబాను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

‘కంటివెలుగు’ సద్వినియోగం చేసుకోవాలి



స్వర్ణ గ్రామంలో కంటివెలుగు ప్రారంభిస్తున్న ఎంపీపీ మహిపాల్‌రెడ్డి

సారంగాపూర్: కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అట్ల మహిపాల్‌రెడ్డి కోరారు. మండలంలోని స్వర్ణ గ్రామంలో గురువారం కంటివెలుగును, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం రైతు పంటపొలంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఫిష్‌పాండ్ పనులు పర్యవేక్షించారు. సర్పంచ్ అయేషా సిద్ధిఖీ, ఎంపీటీసీ సభ్యుడు భోజారెడ్డి, నాయకులు అబ్దుల్ హాదీ, ఎంపీడీవో సరోజ, కార్యదర్శి పీరాజీ ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలో రెండోవిడత కంటి వెలుగు కొనసాగుతోంది. గురువారం మల్లాపూర్‌లో పలువురికి వైద్యసిబ్బంది కంటి పరీక్షలు చేశారు. అనంతరం పలువురికి కళ్లద్దాలు అందజేశారు. వైద్యులు శ్రీకాంత్, శ్వేత, లక్ష్మణ్, సిబ్బంది యాస్మిన్, గంగామణి, శివక్రిష్ణ పాల్గొన్నారు.

ముథోల్: ముథోల్‌లో కంటివెలుగు, ఉపాధిహామీ నర్సరీని ప్రత్యేకాధికారి అంబాజీ గురువారం పరిశీలించారు. అనంతరం రైతు వేదికలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించారు. ఎంపీడీవో సురేశ్‌బాబు, ఏపీవో శిరీష, ఈవో పవన్‌కుమార్ ఉన్నారు.

పలువురిపై కేసు నమోదు

లోకేశ్వరం: మండలంలోని కన్కాపూర్‌కు చెందిన కొబ్బనోల్ల పెద్ద గంగన్న, అబ్దుల్లాపూర్ గ్రామస్తులపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కన్కాపూర్‌లో కొబ్బనోల్ల పెద్ద గంగన్న 33 ఏళ్లుగా ఐదెకరాల్లో పంటలు పండించేవారు. అబ్దుల్లాపూర్ గ్రామస్తులు ఈ భూమిని కబ్జా చేసి క్రీడా మైదానం, భవనం నిర్మించారు. ఈ భవనంలో గృహ ప్రవేశం కోసం గంగన్న కుటుంబ సభ్యులు పూజలు నిర్వహిస్తుండగా వారు అడ్డుకున్నారు. ఈ క్రమంలో గొడవ జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని వారిని సముదాయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పింఛన్ ఇప్పించండి సారూ..

కడెం: మండలంలోని పెద్దూర్‌తండాకు చెందిన వృద్ధురాలు నగవత్ యమున పింఛన్ కోసం ఎంపీడీవో కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తోంది. యమునకు గతేడాది ఆగస్టులో వృద్ధాప్య పింఛన్ మంజూరు పత్రం ఎమ్మెల్యే రేఖానాయక్ అందజేసింది. ఆరు నెలలు గడిచినా నేటికి పింఛన్ అందడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఉన్నాతాధికారులు స్పందించి పింఛన్ డబ్బులు వచ్చేలా చూడాలని వేడుకుంటోంది.



ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

ఖానాపూర్: పట్టణంలోని వాసవి మాత ఆలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 122వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. వాసవి క్లబ్‌తోపాటు వాసవి వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్లబ్ సభ్యులు కిషన్, లక్ష్మీనారాయణ, సతీశ్, మానస, స్రవంతి, వరలక్ష్మి, శ్వేత, ప్రభాకర్, సుదర్శన్, జలందర్, మాధవి, గీతారాణి, వాసవి, సరిత, భూమయ్య తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

భీమన్న దేవుని కల్యాణం



పూజలో పాల్గొన్న భక్తులు



పూజలు చేస్తున్న మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్

కడెం: మండలంలోని ధర్మాజీపేట్ గ్రామంలో భీమన్న దేవుని ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. గురువారం గంగానీళ్లతో ఎదుర్కోలు నిర్వహించి, భీమన్న దేవుని కల్యాణం నిర్వహించారు. బలిదానం, బండారి బసంతం తదితర పూజ కార్యక్రమాలు చేపట్టారు. మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో నాయక్‌పోడ్ కులస్తులు, గ్రామస్తులు, భక్తులు ఉన్నారు.

ఉపాధిహామీలో కూలీల సంఖ్య పెంచాలి

లక్ష్మణచాంద(సోన్): ఉపాధిహామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని డీఆర్డీవో విజయలక్ష్మి అధికారులకు సూచించారు. గురువారం సోన్ మండలం న్యూవెల్మల్ గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులు, మట్టి రోడ్డును పరిశీలించారు. రోడ్డు పనులు సక్రమంగా రైతులకు ఉపయోగకరంగా ఉండేలాగా వేయాలని సూచించారు. ఏపీడీ ఓన ప్రసాద్, హెచ్ఆర్ సుధాకర్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

భైంసారూరల్: కూలీలందరు ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలని కోఆప్షన్ సభ్యుడు గజానంద్ సూచించారు. మండలంలోని కుంబి గ్రామంలో ఈజీఎస్ పనులను గురువారం ఆయన పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. జాబ్‌కార్డు ఉన్నవారు ఉపాధి పనులకు వెళ్లాలన్నారు. ఏపీవో శివలింగం, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పాఠశాలలో సైన్స్‌ఫేర్

తానూరు: మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలలో గురువారం సైన్స్‌ఫేర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన పరికరాలను ప్రదర్శించారు. ఈ సైన్స్‌ఫేర్‌ను తహసీల్దార్ వెంకటరణ పరిశీలిరంచారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ విశాంత్, నాయకులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు కిరణ్, టి.నిర్సంగ్, రాజారెడ్డి ఉన్నారు.

ఏబీవీపీ నాయకుల అరెస్టు

ఖానాపూర్: టీఎస్‌పీఎస్సీ చైర్మన్, ప్రభుత్వ దిష్టి బొమ్మలను దహనం చేయకుండా పోలీసులు పలువురు ఏబీవీపీ నాయకులను గురువారం ఖానాపూర్‌లో ముందస్తుగా అరెస్టు చేశారు. ఎస్సై రజనీకాంత్ ఆధ్వర్యంలో వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. వీరిలో ఏబీవీపీ ఇందూర్ విభాగ్ ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్ చంద్రగిరి శివ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

‘పేపర్ల లీకేజీకి ప్రభుత్వమే బాధ్యత వహించాలి’

నిర్మల్‌చైన్‌గేట్: టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీకి ప్రభుత్వమే బాధ్యత వహించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోటీపరీక్షల ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంతో నిరుద్యోగ యువకులు తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన పోలీసు నియామకాల్లో నిరంకుశ వైఖరి వల్ల ముగ్గురు యువకులు మృతిచెందారని అన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు నష్టపోయారని తెలిపారు. పేపర్ లీకేజీ ఘటన వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో పూర్తిస్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ ప్రశ్నపత్రాలు లీకేజీకి బాధ్యత వహిస్తూ సీఎం కేసీఆర్ వెంటనే రాజీనామా చేయాలన్నారు.

నర్సరీ సందర్శన

తానూరు: మండలంలోని భోసి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 9వ విడత హరితహారం కోసం ఏర్పాటు చేసిన నర్సరీని ఎంపీడీవో శ్రీనివాస్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీలోని మొక్కలు పరిశీలించారు. నాటిన మొక్కలు ఎండిపోకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఎంపీవో మోహన్‌సింగ్, సిబ్బంది ఉన్నారు.

సాధారణ ప్రసవాలపై అవగాహన

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించారు. పలువురు గర్భిణుల ఇంటి వద్దకు వెళ్లి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాల వల్ల కలిగే ప్రయోజనాలను వారికి వివరించారు. సాధారణ ప్రసవాలతో తల్లీబిడ్డలకు మేలు కలుగుతుందన్నారు. ఏఎన్ఎంలు చంద్ర, గంగామణి, శారద తదితరులు ఉన్నారు.

విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచాలి

నిర్మల్‌రూరల్: ఉపాధ్యాయులు విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో రూమ్ టు రీడ్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సమకూర్చబడిన లైబ్రరీ పుస్తకాలపై ఎంఈవోలు, నోడల్ అధికారులు, కాంప్లెక్స్ నోడల్ అధికారులకు గురువారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూమ్ టు రీడ్ అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా ప్రతీ కాంప్లెక్స్‌కు నాలుగు రకాల పుస్తకాలు 1000 వరకు అందిస్తామని తెలిపారు. వీటి ద్వారా కాంప్లెక్స్ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో పఠన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. పుస్తకాలను కాంప్లెక్స్ పాఠశాలలకు రొటేషన్ వారీగా పంపిస్తామన్నారు. వీటిని విద్యార్థులతో చదివించాలని తెలిపారు. మొబైల్ వినియోగం, మీడియా ప్రభావంతో విద్యార్థుల్లో పఠనాసక్తి, పఠనాశక్తి సన్నగిల్లాయన్నారు. ఈనెల 17, 18 తేదీల్లో సీఆర్పీలకు కూడా శిక్షణ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఇందులో రూమ్ టు రీడ్ ప్రతినిధులు అజిత్ రాజ్, తేజస్వి, గీత, క్వాలిటీ కోఆర్డినేటర్ నర్సయ్య, మండల విద్యాధికారులు, నోడల్ అధికారులు, కాంప్లెక్స్ నోడల్ అధికారులు పాల్గొన్నారు.

‘పది’లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

నిర్మల్‌రూరల్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే తెలుగు పండిత ఉపాధ్యాయులకు ప్రీఫైనల్ పరీక్షల ఫలితాలపై గురువారం సమీక్ష నిర్వహించారు. తెలుగు పరీక్షలో విద్యార్థులకు వచ్చిన మార్కులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మొత్తం 6,124 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వార్షిక పరీక్షలు రాయబోతున్నారని, వీరందరూ 100% ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళిక ముందుకు వెళ్లాలన్నారు. పాఠశాలలు, మండలాల వారీగా ర్యాండంగా కొందరు విద్యార్థుల ఫలితాలను అడిగి తెలుసుకున్నారు. వెనుకబడ్డ విద్యార్థులను గుర్తించి మంచి ఫలితాలు సాధించేలా ప్రోత్సహించాలని సూచించారు. జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ పద్మ, సెక్టోరియల్ అధికారులు నరసయ్య, ప్రవీణ్, ఎంఈఓ శంకర్, పండిత పరిషత్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, రాజేశ్వర్, చారి, రవిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ రవీందర్ రెడ్డి

సంక్షిప్త వార్తలు

18 నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని శ్రీ రామాలయంలో పురోహితులు పాల్దె నరహరి శర్మ ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ అరుగుమీద రాంరెడ్డి పేర్కొన్నారు. భక్తులు, గ్రామస్తులు హాజరుకావాలని కోరారు.

హనుమాన్ భక్తుల మాలధారణ

లక్ష్మణచాంద: గ్రామాల్లో హనుమాన్ భక్తులు మాలధారణ స్వీకరిస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన 24 మంది గురువారం హనుమాన్ దీక్ష స్వీకరించి వాగు ఒడ్డున గల హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ముథోల్: ఆష్టా గ్రామంలో గురువారం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. మాజీ సర్పంచులు, ఆశోక్‌రావు, పోశెట్టి, మాజీ ఎంపీటీసీ సాయిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాయుల శ్రీనివాస్, అనిల్ కృష్ణ, ఎంపీటీసీ పాల్గొన్నారు.

పక్షులను సంరక్షించాలి

లోకేశ్వరం: వేసవిలో ప్రతి ఒక్కరూ పక్షులను సంరక్షించాలని బోథ్‌కు చెందిన పక్షి ప్రేమికుడు వెంకటేశ్ అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలల ఆవరణలో పక్షుల స్థావరాల వద్ద గురువారం నీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్‌ను పాఠశాల సిబ్బంది సన్మానించారు. హెచ్ఎం రమేశ్‌కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

వాహనాల తనిఖీ

భైంసారూరల్: వాహనదారులు తమవెంట వాహన పత్రాలు తెచ్చుకోవాలని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. మండలంలోని దేగాం గ్రామంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనదారుల వాహన పత్రాలను పరిశీలించారు.

పరామర్శ

కుంటాల: అంబకంటి తండాకు చెందిన జాదవ్ సుభాష్ తండ్రి వెంకట్రాం అనారోగ్యానికి గురయ్యాడు. ఇటీవల శస్త్రచికిత్స చేసుకోగా గురువారం బీజేపీ రాష్ట్ర నాయకుడు పవార్ రామారావు పటేల్ ఆయన్ను పరామర్శించారు. సర్పంచ్ జాదవ్ శంకర్, ఎంపీటీసీ సుధాకర్ ఉన్నారు.

ముగిసిన సప్తాహం

కుభీర్: మండల కేంద్రంలోని దత్తాత్రి మందిర్‌లో గత ఏడు రోజులుగా కొనసాగుతున్న సప్తాహం గురువారం హారతితో ముగిసింది. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.